క్లుప్తంగా

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

చిన్నచింతకుంట: అక్రమ అరెస్టులు చేసి ఉద్యమాలను ఆపలేరని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం, ఎండీ పాష అన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో చిన్నవడ్డేమాన్, లాల్‌కోట గ్రామాలకు చెందిన విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు బుధవారం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన సందర్భంగా వ్యాఖ్యలు చేశారు.

దేవరకద్ర: మండలానికి చెందిన పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి శివకుమార్‌ను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. హైదరాబాద్‌లో జరిగే ఆందోళన కార్యక్రమంలో పాల్గొని అవకాశం ఉండడంతో చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులకు మొక్కల గురించి వివరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని 10 పాఠశాలల్లో ఔషధ మొక్కలను పెంచనున్నారు. ఈ మేరకు విద్యార్థులకు డీఈఓ రవీందర్ చేతుల మీదుగా మొక్కలను పంపిణీ చేశారు. విద్యార్థులకు ఔషధ మొక్కల ప్రాధాన్యత తెలిసేలా, వాటి వినియోగంపై అవగాహన వచ్చేలా చూడాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి విశ్వేశ్వర్‌రావు, సైన్స్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో మైనార్టీల కోసం స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ ఏర్పాటుచేసి లక్షలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని మిల్లీమహాజ్ మహబూబ్‌నగర్ కన్వీనర్ తఖీ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయలేదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ చర్యలు చేపట్టలేదన్నారు. ఇకనైనా సమస్య పరిష్కరించాలని కోరారు. చీఫ్ ప్యాట్రన్ అన్వర్‌పాష, కోకన్వీనర్లు మిర్జా ఖుద్దూస్‌బేగ్, హాఫిజ్ ఇద్రీస్, నూరుల్ పాల్గొన్నారు.

పూలతో అభిషేకం

భూత్పూర్: తెలంగాణ రైతుల కష్టాలను తెలుసుకున్న మాజీ సీఎం కేసీఆర్ వారి సంక్షేమం కోసం అహర్నిషలు కృషిచేశారని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పాత మొల్గర శివారులోని చెక్‌డ్యాం వద్ద పారుతున్న నీటికి పూలతో అభిషేకం చేశారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. పోల్కంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త సుదర్శన్‌గౌడ్‌ను, తాళ్లగడ్డకు చెందిన నారాయణగౌడ్, నందిపేటకి చెందిన వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి భార్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, మాజీ సర్పంచులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు.

పాఠశాలల సమయంలో ఆర్టీసీ బస్సులు నడపాలి

మక్తల్: పాఠశాలల సమయంలో ఆర్టీసీ బస్సులను నడపాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బుధవారం జరిగిన అసెంబ్లీ నేపథ్యంలో రవాణ శాఖమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో విద్యార్థులకు పాఠశాలల సరియైన సమయాల్లో బస్సులను నడపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కొన్ని కొత్త బస్సులు వేస్తామని ఆ సమయంలో కొత్తరూట్‌లో నడిపించాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

మూణ్నాళ్ల ముచ్చటేనా?

- ఈ విద్యాసంవత్సరంలో ప్రారంభం కాని అల్పాహారం పథకం
- గత ఏడాది నియోజకవర్గానికి ఒక పాఠశాలలో అమలు
- తిరిగి ప్రారంభించాలంటున్న విద్యార్థులు



అల్పాహారం కోసం క్యూలో నిల్చున్న విద్యార్థులు (ఫైల్)

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందజేత పథకం పరిస్థితి మూణ్నాళ్ల ముచ్చట లాగే కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 2023 అక్టోబర్ 6న రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాల చొప్పున ఎంపిక చేసి ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది వేసవి సెలవుల వరకు కొనసాగించారు. పథకం విజయవంతం అయితే అన్ని పాఠశాలల్లోనూ అమలు చేయాలని సంకల్పించినప్పటికీ ప్రభుత్వం మారటంతో ప్రస్తుత అకాడమిక్ ఇయర్ పథకం ఊసేలేకుండా పోయింది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మూడు హైస్కూళ్లలో అల్పాహార పథకాన్ని అమలు చేశారు. మహబూబ్‌నగర్ మాడల్ బేసిక్ స్కూల్, దేవరకద్ర జెడ్పీహైస్కూల్, జడ్చర్ల నియోజకవర్గంలోని కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో ఈ ఏడాది వేసవి సెలవుల వరకు విద్యార్థులకు ప్రతిరోజు ఒక అల్పాహారం అందించారు. దీనివల్ల జడ్చర్ల నియోజకవర్గంలోని కోడ్గల్ జెడ్పీ హైస్కూల్ పరిధిలోని 270మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది. హైస్కూల్‌కు కోడ్గల్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాలైన కుర్వపల్లి, మక్తపల్లి, గైరాన్‌తండా, కుర్వపల్లి తండా, లింగంపేట, లక్ష్మీనాయక్‌తండా, నల్లకుంటతండాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ఆయా ప్రాంతాల నుంచి సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో నడుచుకుంటూ వస్తుంటారు. దీంతో వారంతా ఇళ్ల వద్ద ఉదయం 8 గంటలకే బయలుదేరాల్సి వస్తుంది. చాలావరకు విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయం ఆధారంగా, వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. వీరంతా పొద్దున్నే లేచి పొలం పనులకు వెళ్తుంటారు. సమయం సరిపోకపోవడం కారణాల వల్ల ఇళ్లల్లో వంటచేసేవారు విద్యార్థులు పాఠశాలలకు వచ్చే సమయంలో ఉండరు. దీంతో విద్యార్థుల్లో చాలా వరకు అర్ధాకలితో లేదా ఉదయం ఏమీ తినకుండానే పాఠశాలకు వస్తుంటారు. కొందరు రాత్రిళ్లు మిగిలిపోయిన అన్నం తిని వస్తుంటారు. ఇలా ఇబ్బందులు ఎదుర్కొంటూ పాఠశాలలకు వచ్చే ఎంతోమంది విద్యార్థులకు అల్పాహారం అందజేత ఎంతో ప్రయోజనం చేకూర్చింది. విద్యార్థులు సమయానికి రావడంలో ఇబ్బందులు తప్పాయి. కానీ ప్రస్తుతం అల్పాహారం పథకం అమలు కాకపోవడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. కోడ్గల్ పాఠశాల విద్యార్థులకు తిరిగి కష్టాలు మొదలయ్యాయి. ఒక్క కోడ్గల్ పాఠశాలే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఈ సమస్య విద్యార్థులను వేధిస్తోంది. గత ఏడాది కోడ్గల్‌లో అల్పాహారం ప్రారంభం అయ్యాక మండలంలోని పెద్ద ఆదిరాల, గొల్లపల్లి, వల్లూరు, పోలేపల్లి, ఆలూరు జెడ్పీహైస్కూళ్ల విద్యార్థులు సైతం తమ పాఠశాలల్లోనూ ప్రారంభించాలని డిమాండ్ చేయడాన్ని బట్టి పరస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో కోడ్గల్‌తో పాటు ఇతర పాఠశాలల్లోనూ అల్పాహారం పథకం అమలు చేసి గ్రామీణులైన తమకు లబ్ధి చేకూర్చాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

తిరిగి ప్రారంభిస్తే బాగుంటుంది..



పోయినేడాది అక్టోబర్ నుంచి బడిలో పెట్టిన అల్పాహార పథకం నాలాంటి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడింది. నేను 9వ తరగతి చదువుతున్నపుడు టిఫిన్ ప్రారంభించారు. దీంతో ఎలాంటి టెన్షన్ లేకుండా బడికి వచ్చేదాన్ని. ఇప్పుడైతే టిఫిన్ పెట్టడం లేదు. దీంతో గతంలో మాదిరిగానే మళ్లీ తరచూ తినకుండానే బడికి వచ్చి మధ్యాహ్నం వరకు పస్తులతోనే పాఠాలు వినాల్సివస్తోంది. తిరిగి అల్పాహారం ప్రారంభిస్తే మాలాంటి వారికి ఉపయోగకరంగా ఉంటుంది.

– నందిని, మొరంబాయితండా, పదోతరగతి, కోడ్గల్ జెడ్పీహైస్కూల్

విద్యార్థులు ఎదురుచూస్తున్నారు..



గ్రామీణ ప్రాంతాలనుంచి విద్యార్థులు రావటం వల్ల ఇళ్ల వద్ద అంత ఉదయం టిఫిన్ చేసేవారు కాదు. వారంతా అల్పాహారం పథకం ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నారు. సార్ ఎప్పుడు ప్రారంభిస్తారు అని అడుగుతున్నారు. దూర ప్రాంతాలనుంచి వచ్చే విద్యార్థులకు అల్పాహార పథకం ఎంతో ఉపయోగపడింది. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తిరిగి ఈ కార్యక్రమం ప్రారంభమయ్యేలా సీఎం దృష్టికి తీసుకువెళ్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

–శ్రీనివాసులు, హెచ్‌ఎం, కోడ్గల్ జెడ్పీహైస్కూల్

వెంటనే ప్రారంభించాలి



గత ఏడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద కోడ్గల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అల్పాహారం అందించాం. దీంతో 270మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగింది. పాఠశాలలు పున:ప్రారంభం అయ్యాక ఆ పథకం ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పథకాన్ని పున:రుద్ధరించాలి. తద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి పస్తులతో వచ్చే వారికి మేలు జరుగుతుంది.

– కోడ్గల్ యాదయ్య, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్

రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్

మహమ్మదాబాద్: ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రుణమాఫీపై రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ సూచించారు. బుధవారం నంచర్లలో పంటలను పరిశీలించారు. అనంతరం మొకర్లాబాద్ రైతు వేదికలో రుణమాఫీ సందేహాలతో అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడారు. రైతులకు రుణమాఫీపై క్లారిటీ ఇచ్చారు. బ్యాంకుల్లో కూడా రైతులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా చూడాలని తెలిపారు. కొందరి రైతుల పేర్లు అకౌంట్‌బుక్‌లో ఒకటి పట్టాదారు పాసుపుస్తకంలో మరొక్కటి ఉన్నందున రాకపోవచ్చని అన్నారు. అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం కానందున ఇలా ఎన్నో సమస్యలతో పేర్లు జాబితాలో రాలేకపోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. అనంతరం మహమ్మదాబాద్‌లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. పంటలు సాగుచేస్తున్న తరుణంలో రైతులకు తగిన ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. దుకాణాల్లో ఎరువుల వివరాలు స్టాక్ బోర్డును తప్పకుండా చూయించాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఫనీషా ఉన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుపై వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న తండావాసులు

జడ్చర్ల టౌన్: నసురుల్లాబాద్‌కి మంజూరైన సబ్‌స్టేషన్‌ను.. నసురురుల్లాబాద్ తండా పరిధిలోని స.నంబరు 526లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు బుధవారం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గతంలో స్థలం లేదని సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయలేదని, అయితే పై సర్వేనంబరు భూమిలో ఏర్పాటు చేస్తే తండ అభివృద్ధి జరుగుతుందని వినతిపత్రంలో పొందుపర్చారు. గ్రామంలో స్థలం లేకున్నప్పటికీ కొందరు రాజకీయ కక్షతో వ్యవసాయం చేస్తున్న అసైన్డ్ భూమిని తీసుకుని అక్కడ సబ్‌స్టేషన్ నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనంతరం మహబూబ్‌నగర్ ఆర్‌డీఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. శంకర్‌నాయక్, రాజేష్, అగ్గిరాం, రమేష్, రాజు, పెంట్యనాయక్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు



నవాబుపేట: లింగంపల్లి, గురుకుంట, దరిపల్లి గ్రామాల్లో బుధవారం పోచమ్మ, మైసమ్మ బోనాల వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు తరలివెళ్లి నైవేద్యాలు సమర్పించారు. చిన్నారులు మొలకల బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు.

బీజేపీ పాలనలో తెలంగాణకు అన్యాయం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్రంలోని బీజేపీ పాలనలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని ప్రగతిశీల ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విభజన హామీల్లో తెలంగాణకు దక్కాల్సిన ఒక్కటిగా కూడా నెరవేర్చలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా, బయ్యారం ఉక్కుకర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐటీ, నీట్ వంటి ఒక్క హామీని నెరవేర్చకుండా ఏకపక్షంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో పసుల రాజు, గోపాలకృష్ణ, నరేష్, పులిజా రవికిరణ్, వెంకట్‌రాములు, కృష్ణ, సాయిబాబా, ఆనెం శ్రీధర్, దినేష్, శ్రీకాంత్, మహేష్, శేఖర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

అన్ని వివరాలు: All that the part and parcel of plot total extent 305 sq.yards, in Sy No 811.00 situated within the limits Chinnadargally Village, Hanwada Mandal, Mahabubnagar Dist.
హద్దులు: East: Plot of Vendee, West: Land of Vendor
North: 3 ft short & plot of Gouri
South: House of Ramulu & Land of Erya Naik

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

ప్రమాదకర ఇళ్లను ఖాళీ చేయించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దేవన్న



పెంటయ్యతో మాట్లాడుతున్న మహమ్మదాబాద్ తహసీల్దార్ తిరుపతయ్య

మహమ్మదాబాద్: వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో ప్రజలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని మహమ్మదాబాద్ తహసీల్దార్ తిరుపతయ్య సూచించారు. బుధవారం నంచర్లకి చెందిన పెంటయ్యను పరామర్శించారు. మంగలి పెంటయ్య ఇల్లు కూలిపోవడంతో గ్రామపంచాయతీ భవనంలో ఉంటున్నాడు. పంచాయతీ భవనం కూడా పాతది కావడంతో వర్షం నీరుకురుస్తూ ప్రమాదకరంగా ఉంది. దీంతో వారికి పాఠశాల భవనంలో ఉండాలని తహసీల్దార్ సూచించారు. కాగా పెంటయ్య ప్రభుత్వం తనకు ఆర్థికసాయం అందిస్తే చిన్నపాటి గుడిసె వేసుకుంటానని అధికారులను కోరారు.

గండేడ్: వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ దేవన్న, ఎంపీఈఓ నరేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. వర్షాల వల్ల శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలే ప్రమాదం ఉందన్నారు. అలాంటి వాటిలో ఎవరూ నివాసం ఉండకుండా చూడాలన్నారు. వారికి గ్రామంలో ఇతర ఏదైనా వసతి కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, వన మహోత్సవం కొనసాగించాలని పేర్కొన్నారు. ఏపీఓ హరిశ్చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పార్కును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కోర్టు సమీపంలోని పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. అక్కడ చదును చేయించడమే గాక చుట్టుపక్కల పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాసికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రానికి చెందిన సురమోని రజినికి ఉస్మానియా యూనివర్సిటీ వ్యాయామ విద్యావిభాగంలో డాక్టరేట్‌ను ప్రకటించింది. రజిని అధ్యాపకుడు రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో 'ఎఫెక్ట్ ఆఫ్ పాలిమెట్రిక్ ట్రెనింగ్ ఆన్ ది సెలెక్టెడ్ మోటార్ ఎబిలిటీస్ అమాంగ్ కాలేజ్ బాస్కెట్ బాల్ ప్లేయర్ ఎట్ హైద్రాబాద్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఆమె కొన్ని సంవత్సరాలుగా ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల వికారాబాద్‌లో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ఆయాగ్రామాలు, మండల కేంద్రాల్లో మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ ప్రస్థానం గొప్పదని స్థానిక సంస్థ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ లింగూనాయక్, నాయకులు శ్రీధర్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, మనోహర్, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. భూత్పూర్ మండలంలోని పాత మొల్గర శివారులోని చెక్‌డ్యాం వద్ద మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వేడుకల్లో, మెట్టుగడ్డలోని అంధుల పాఠశాలలో పండ్లు పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శివరాజ్, వినోద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. హన్వాడలో మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాల్‌రాజు, నాయకులు లక్ష్మయ్య, చెన్నయ్య పాల్గొన్నారు. దేవరకద్ర మండల కేంద్రంలో అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, ఆంజనేయులు, బాల్‌రాజు, రాందాసు, రాధాకృష్ణ, యాదయ్య, పురేందర్, గౌస్, జక్కి, చెన్నయ్య పాల్గొన్నారు. జడ్చర్ల అంబేడ్కర్ చౌరస్తాలో కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, సతీష్, మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి పాల్గొన్నారు. రాజాపూర్ మండల కేంద్రంలో సున్నపుశ్రీను, శేఖర్‌గౌడ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. అడ్డాకుల మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎం.జితేందర్‌రెడ్డి, రంగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటికీ మొక్కల పంపిణీ




మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వన మహోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వివిధ వార్డుల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కొనసాగుతోంది. తాజాగా బుధవారం ఏనుగొండ, (వార్డు నం.5), శ్రీనివాసకాలనీ (వార్డు నం.6), పద్మావతికాలనీ (వార్డు నం.7), (పాలకొండ (వార్డు నం.9, క్రిస్టియన్ పల్లి (వార్డు నం.10) లలో వీటిని ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముషా నరేందర్, కాంగ్రెస్ నాయకుడు ఎం.రాజు, ఏఈ వైష్ణవి, ఏఎస్‌ఓ సలీం తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డులో గురువారం లావాదేవీలు కొనసాగనున్నాయి. మంగళవారం బోనాల పండుగ, బుధవారం కనుమ పండుగ సందర్భంగా మార్కెట్‌కు వరుసగా రెండు రోజులు సెలవు ఇచ్చారు. దీంతో బుధవారం జరగాల్సిన ఉల్లి వేలం వాయిదా పడింది. గురువారం మార్కెట్‌లో లావాదేవీలు జరగడంతో పాటు ధాన్యం టెండర్లు నిర్వహించనున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కృష్ణ

మిడ్జిల్: మండల కేంద్రంలో పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి కృష్ణ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రసవాల సంఖ్య పెంపునకు కృషిచేయాలన్నారు. వ్యాక్సినేషన్ వంటి వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దోమల నివారణ కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించాలన్నారు. డ్రైడే, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి విషయంలో సూచనలు చేయాలని వివరించారు. మండల వైద్యాధికారి శివానంద్ పాల్గొన్నారు.

సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాజకీయాల్లో 50 ఏళ్లు పూర్తిచేసుకొని మరోసారి ఎంఐఎం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అబ్దుల్ హాదీని, రెండోసారి ఎంఐఎం పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన కౌన్సిలర్ సయ్యద్ సాదతుల్లా హుస్సేనిని... కింగ్‌షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. క్లబ్ ఫౌండర్ జహంగీర్ పాష ఖాద్రీ, సయ్యద్ సాబేర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE

1) ESCORTS PT 439 DIESEL SAVER 41 HP 2020 MODEL E3567841
2) JD 5045 D 4WD TELEMATIC PADDY OIL MITA STRS 2022 MODEL PY3029D701495
3) EICHER 480 DI 42 HP 2022 MODEL S325M95638
4) ITL DI 74042 TRACTOR 2022 MODEL TS38 T 2361
5) M&M 475 XP PLUS PS RCR PTO LT AUX VALVE 44 HP 2023 MODEL TS34 TB 4860
6) ITL DI 42 RX 42 HP SINGLE CLUTCH OIB PS 2020 MODEL TS06 UD 3823
7) KUBOTA MU 5502 4 WD 55 HP 2022 MODEL BNG5247
8) MAHINDRA 475 DI BP MKM DLX NBP LT WL BS 3A 2022 MODEL TS31 TA 5709
9) ESCORTS PT EURO 41 PLUS 44HP 2018 MODEL TS31 T 3019
10) ITL DI 42 RX 42 HP SINGLE CLUTCH OIB PS 2022 MODEL TS06 FG 8961
11) ITL DI 74042 TRACTOR 2018 MODEL 3100ELI73D631692F3
12) MAHINDRA 415BP OIB PCM 2020 MODEL TS32T6476
13) MAHINDRA 575 YUVO 45 HP 14 x 9 TYRE OIB PS 2021 MODEL NMD5GAE0008

Cell : 77021 88864
1st Floor, Upstairs of Bharath Sanitation, Opp. Padmavathi Colony Bus Stop, Hyderabad Road, MAHABUBNAGAR.



జిల్లా ఆస్పత్రిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం





పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. రెండు రోజుల నుంచి సూపరింటెండెంట్ లేకపోవడం, వర్షాలు కురుస్తుండడంతో ఆస్పత్రి ఆవరణలో బురదమయంగా మారింది. పక్కనే ఉన్న డ్రెయినేజీలో పూర్తిగా వర్షం నీరు నిండి నిలిచింది. ఇక వార్డులతో పాటు ఇతర విభాగాలు సైతం అపరిశుభ్రంగా దర్శనం ఇస్తున్నాయి. ఆస్పత్రి ఆవరణలో అయితే చెత్త, వాడిపడేసిన కవర్లు కనిపిస్తున్నాయి.